సాక్షి
కుమురం భీం

మంగళవారం । 17 । జనవరి । 2023



కొలాంల కొంగు బంగారం
తిర్యాణి మండలం దంతన్‌పెల్లిలో భీమన్న దేవర జాతర నిర్వహించనున్నారు. జాతరకు కొలాం కులస్తులు, ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. 9లో▸

రేపటిలోగా ఫీజు చెల్లించాలి
కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రెగ్యులర్ డిగ్రీ విద్యార్థులు సెమిస్టర్– 1, 3, 5 పరీక్ష ఫీజును ఈ నెల 18లోగా చెల్లించాలని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయని, వివరాలకు 98663 98678 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.1 /13.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు పెరుగుతాయి. చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటు
ఆసిఫాబాద్‌రూరల్: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన మహాసభల్లో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఇందురావు, ఉమ్మడి జిల్లా ప్రతినిధిగా శాంతికుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

‘అడ ఎస్‌బీఐ’ తరలించొద్దు

కలెక్టరేట్ వద్ద అడ గ్రామస్తులు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని అడ ఎస్‌బీఐ బ్రాంచిని కలెక్టరేట్‌కు తరలించొద్దని అడ గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ అడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐలో 54 గిరిజన గ్రామాల ప్రజలకు పంట రుణాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 35 సంవత్సరాలుగా విద్యార్థులతోపాటు పింఛన్‌దారులు బ్యాంకు సేవలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. బ్యాంకును కలెక్టరేట్‌కు తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, గ్రామస్తులు బాబురావు, శంకర్, శ్యాంరావు, సందీప్, తిరుపతి, రమేశ్ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి

పాలకవర్గ సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్ మల్లేశ్, డైరెక్టర్లు

ఆసిఫాబాద్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. కెరమెరి మండలంలోని నాబార్డు గోదాముకు ప్రహరీ, ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి మండలాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. ఇందుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి మార్కెటింగ్ శాఖ సంచాలకులకు పంపించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ గుర్నులె శంకర్, డైరెక్టర్లు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఇంగు మల్లేశ్, మిట్ట పోషన్న, దాంపెల్లి శ్యామ్‌రావు, పెందూర్ ఆనంద్‌రావు, గాదె ప్రవీణ్ కుమార్, ఉప్రె రోషన్ కుమార్, ఏఎంసీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు చర్యలు

మాట్లాడుతున్న డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్

బెజ్జూర్(సిర్పూర్): అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఆశిష్‌సింగ్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌ల్లో పర్యటించారు. పెంచికల్‌పేట్ రేంజ్‌లోని నందిగామ అటవీ ప్రాంతంలో గల రాబందుల గుట్ట, బెజ్జూర్ రేంజ్‌లోని మత్తడి అటవీ ప్రాంతాలను సందర్శించారు. గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, సాసర్ పిట్లు, చెక్‌డ్యాములను పరిశీలించారు. అడవుల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. రేంజ్ అధికారులు దయాకర్ రావు, వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

సంబురంగా సంక్రాంతి

ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో ఎడ్లబండి పోటీలు


సంజీవనగర్ శివాలయంలో లక్ష పసుపుకొమ్ములతో నోములు


జిల్లా కేంద్రంలో సంక్రాంతి నోములు నోముకుంటున్న మహిళలు


- పలుచోట్ల కబడ్డీ పోటీలు, ఎడ్ల పందేలు
- నోములు నోచుకున్న మహిళలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా ఆది, సోమ వారాల్లో సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్ల ముంగిట వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పంచాక్షరి నోము, రుక్మిణీ కల్యాణం, శ్రీనివాస కల్యాణం, బృందావనం, చెర్లచామంతి, గోపాల కల్యాణం, తులసీ కల్యాణం, సూర్యబోనాలు, చంద్రబోనాలు, గ్రామ పసుపు, చెరుకుతోట, పుసుపుతోట, లాలిగొరమ్మ, రేపల్లెవాడ, జామ, నిమ్మ నోములు నోముకున్నారు. బ్యాండ్ మేళాతో కాలనీలు హోరెత్తాయి. కనుమ సందర్భంగా ఆలయాల్లో పూజలు చేశారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి.

లక్ష పసుపు కొమ్ములతో నోములు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని సంజీవనగర్ శివాలయంలో మహిళలు లక్ష పసుపు కొమ్ముల నోము ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల వస్త్రాలు, పసుపు కొమ్ములతో మహిళలు సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు.



జీపీలపై కంటి వెలుగు భారం

- నిర్వహణ బాధ్యతలన్నీ చూడాలని ఆదేశం
- చిన్న పంచాయతీలకు భారం
- సర్పంచుల్లో ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న రెండో విడత ‘కంటి వెలుగు’ నిర్వహణ భారం పంచాయతీలపైనే పడనుంది. కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 19 నుంచి అన్ని మండలాల్లో లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కార్యక్రమ నిర్వహణ భారాన్ని మాత్రం గ్రామ పంచాయతీలపై వేశారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు టెంట్లు, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీటి సౌకర్యంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించారు. ఇందులో భోజన ఖర్చులు మినహా మిగిలిన ఖర్చులు పంచాయతీలే భరించాల్సి ఉంది.

5,67,718 మందికి పరీక్షలు..

జిల్లాలో 335 పంచాయతీలు ఉన్నాయి. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 5,67,718 మందికి పరీక్షలు నిర్వహించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకనుగుణంగా ఈ నెల 19 నుంచి 90 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహించి దృష్టి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జనాభాను బట్టి గరిష్ఠంగా నెల రోజులపాటు పంచాయతీల్లో కంటి శిబిరాలు నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేశారు. అందుకు 28 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కంటి పరీక్షల కోసం 28 ఏఆర్ యంత్రాలను సమకూర్చారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ అధికారులే అవసరమైన టెంట్లు, టేబుళ్లతోపాటు ప్రజల కోసం కుర్చీలు, తాగునీటి, భోజన వసతి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఇప్పటికీ చాలా వరకు కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలలు, అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. అలాంటి చోట కంటివెలుగు నిర్వహణ కష్టతరంగా మారే అవకాశం ఉంది. అలాంటి చోట్ల అందుబాటులో ఉన్న ఖాళీ భవనాల్లో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడ కూడా పంచాయతీలే సౌకర్యాలు సమకూర్చాల్సి ఉంది. కేవలం కంటి పరీక్షలు చేసే సిబ్బంది భోజనాల ఖర్చుల కింద రోజుకు రూ.1000 చొప్పున ప్రభుత్వం చెల్లించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చిన్న పంచాయతీలపై భారం..

అసలే నిధులు లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ‘కంటి వెలుగు’ నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. మూలుగుతున్న నక్కపై తాటికాయ పడిన ట్లెంది చిన్న జీపీల పరిస్థితి. అంతంత మాత్రమే ఆర్థిక వనరులు ఉన్న పంచాయతీలు ఇప్పటికే కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం నుంచి అరకొరగా విడుదలైన నిధులతో సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులు, ట్రాక్టర్ల వాయిదాలను చెల్లించలేక సర్పంచులు సతమతమవుతున్నారు. ఈ తరుణంలో కంటివెలుగు నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించటంపై ప్రభుత్వ తీరుపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా ప్రభుత్వంపై విమర్శలు చేయకపోయినా కంటి వెలుగు ఎలా నిర్వహించాలో తెలియక మదన పడుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

“ఈ నెల 19 నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి కావాల్సిన అన్నిఏర్పాట్లు పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాం. శిబిరం నిర్వహణకు కావాల్సిన టేబుల్స్, కుర్చీల తోపాటు తాగునీటి వసతులు కల్పిస్తాం. కంటి పరీక్షలు చేసే సిబ్బంది భోజన ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుండగా, మిగిలిన నిర్వహణ బాధ్యతలన్నీ పంచాయతీల ఆధ్వర్యంలోనే చేపడుతున్నాం. గ్రామల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు శిబిరాలకు హాజరయ్యేలా కృషి చేస్తున్నాం.”

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

19 నుంచి ‘కంటి వెలుగు’ ప్రారంభం

- కలెక్టర్ రాహుల్‌రాజ్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ సురేశ్‌కుమార్, అధికారులు

ఆసిఫాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 19 నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణ జిల్లాలో 26 బృందాలతోపాటు ఒక అదనపు బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన వాహనాలు, 26 ఏఆర్ మిషన్లు, ట్రయల్ లెన్స్ బాక్సులు, స్నెల్, విజన్ చార్ట్, కిట్లు, ట్యాబ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించామన్నారు.

పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని చేరుకోవాలి

అంతకు ముందు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, వైద్యారోగ్య శాఖ అధికారులు, పురపాలక సంఘ అధికారులతో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాలో ప్రారంభిస్తారని, మిగిలిన జిల్లాలో 19న ఉదయం 9 గంటలకు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. బృందాలు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు అందుబాటులో ఉండాలని, ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఇందుకోసం వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో పరీక్షలు నిర్వహించిన వెంటనే అవసరమున్న వారికి అద్దాలు అందించాలన్నారు. కంటి సమస్య ఉన్న ప్రతిఒక్కరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, డీపీవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి


పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్(జైనూర్): ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండలం గౌరి పంచాయతీ పరిధిలోని గౌరిదేవుగూడ గ్రామంలో గల జల్కర్ దేవి, జంగుబాయి పేటేడా బేయ్యే దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆదివాసీ పండుగలను పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చదువుతోపాటు ఆదివాసీ పద్ధతులను నేటి తరానికి నేర్పించాలని, మన సంస్కృతిని మర్చిపోవద్దని సూచించారు. పుష్యమాసంలో పూజలు చేయడం తరతరాలుగా వస్తోందన్నారు. గ్రామంలో రూ.7లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, రూ.5లక్షల వ్యయంతో నిర్మించే అంగన్‌వాడీ కేంద్రం భవనానికి భూమిపూజ చేశారు. సీసీ రోడ్లు, మంచినీటి బావి కోసం రూ.5లక్షల చొప్పున, జల్కార్ దేవి మందిరం నిర్మాణం కోసం మరో రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సర్పంచులు సిడాం భీంరావు, శ్యాంరావు, ఎంపీటీసీ భగవంతరావు, నాయకులు పాల్గొన్నారు.

‘అడ’ అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఆసిఫాబాద్‌రూరల్: అడ ప్రాజెక్టు కింద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాజెక్టు పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను టూరిజం అధికారి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అడ ప్రాజెక్టు వద్ద బోటుతోపాటు పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు మూడు కాటేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్ప్రింగ్ వంతెన నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తయిందని, ఓ రెస్టారెంట్ నిర్మిస్తామని చెప్పారు. కేటాయించిన పనులను వేగంగా పూర్తిచేసి, పర్యాటకులకు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

కోడి పందేల జోరు!

- మూడు రోజుల్లో 49 మందిపై కేసు
- నిందితుల వద్ద నుంచి కోళ్లు, కత్తులు, నగదు స్వాధీనం



కౌటాల(సిర్పూర్): సంక్రాంతి పండగ వేళ జిల్లాలో కోడి పందేలు జోరుగా సాగాయి. గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల శివారుల్లో నిర్వహించిన స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు రోజుల వ్యవధిలోనే 49 మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి భారీగా నగదు, కోడి పుంజులు, పందెం కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

పక్కాప్లాన్‌తో నిర్వహణ

తొలినాళ్లలో అడవి కోళ్లు, పెరటి కోళ్ల పోరాడుకునేలా ప్రేరేపించి ప్రజలు వినోదం పొందేవారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఈ పందేలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పోలీసు, జనసంచారం అంతగా లేని ప్రాంతాలను గుర్తించి పక్కా ప్లాన్‌తో పందేలు నిర్వహిస్తున్నారు. రెండు గ్రూపుల వ్యక్తులు నచ్చిన కోడిపై బెట్టింగ్ కడతారు. ఏటా సంక్రాంతి పండుగకు భారీ ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తున్నా నియంత్రణలో పోలీసులు సఫలీకృతం కావడం లేదు. ఆడపదడపా దాడులు చేస్తూ నామ మాత్రపు కేసులు నమోదు చేస్తున్నారు. జంతు హింస నిరోధక చట్టం– 1960 ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

మూడు రోజుల్లో కేసులు ఇలా..

- కౌటాల మండలం సాండ్‌గాం గ్రామ శివారులో శనివారం కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6 వేల నగదు, 2 కత్తులు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.
- దహెగాం మండల కేంద్రంతోపాటు గొర్రెగుట్ట గ్రామంలో కోడి పందేల స్థావరాలపై ఎస్సై సనత్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. 13 మందిపై కేసు నమోదు చేసి, నిందితుల వద్ద నుంచి రూ.4,150 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామ సమీపంలో శనివారం కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. రూ.1,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- సిర్పూర్(టి) మండలంలో కోడిపందాలు జోరుగా కొనసాగాయి. ఈ మండలంలో రెండుచోట్ల పోలీసులు దాడులు నిర్వహించారు. 18 మందిని పట్టుకుని కేసు నమోదు చేశారు. రూ.21,130 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- బెజ్జూర్ మండలంలోని సుశ్మీర్ అటవీప్రాంతంలో ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

గేటు ఏర్పాటును అడ్డుకున్న కాలనీవాసులు


మిల్లు ప్రతినిధులతో మాట్లాడుతున్న కాలనీవాసులు, మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీలో ఎస్పీఎం యాజమాన్యం గేటు ఏర్పాటుకు ప్రయత్నించగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు అడ్డుకున్నారు. రోడ్డుపై అడ్డంగా గేటు ఏర్పాటుకు అనుమతి పత్రాలు ఉన్నాయంటూ ఎస్పీఎం ప్రతినిధులు కాలనీలో సన్నాహక పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఘటనా స్థలానికి చేరుకుని అనుమతి పత్రాలు చూపించాలని అడగడంతో ఎస్పీఎం ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గేటు ఏర్పాటుకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గేట్ల ఏర్పాటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. రోడ్లకు అడ్డంగా నిర్మించిన గేట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న డ్రగ్ మాఫియాను అరికట్టాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొంతమంది వ్యక్తులు యువకులే లక్ష్యంగా హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి అలవాటు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పోలీసు యంత్రాంగం డ్రగ్ మాఫియాపై కఠినంగా వ్యవహరించి, యువతను చెడుదారి పట్టకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావ్, సతీష్, టీకానంద్, మాలాశ్రీ, పురుషోత్తం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ డెయిరీ నిర్వాహకులకు రిమాండ్

బెల్లంపల్లి: డెయిరీ నిర్వహణ పేరుతో బెల్లంపల్లి ప్రాంత రైతుల వద్ద రూ.లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సంతమగులురు మండలం చౌటుపాలెం గ్రామానికి చెందిన కందిమల్ల ఆదినారాయణ అలియాస్ హరిబాబు అలియాస్ హరికిషన్, అనంతపురం జిల్లా గంగవరం గ్రామానికి చెందిన బోయపాటి షేజల్ అలియాస్ నందినిని ఈ నెల 13వ తేదీన బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్ ప్రకటించారు. ఆ నిందితులను మరుసటి రోజు 14వ తేదీ శుక్రవారం చెన్నూర్ కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. సదరు నిందితులను న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడంతో ఆదిలాబాద్ జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

చోరీకి యత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో గల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీకి ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారు. చోరీకి పాల్పడుతున్న గుర్తు తెలియని ఇద్దరి వ్యక్తులను గమనించిన అసోసియేషన్ భవన మేనేజర్ చెట్టిపల్లి గట్టయ్య వెంటనే తేరుకుని స్థానికులకు సమాచారం అందించి అప్రమత్తమయ్యాడు. దొంగలు రెండు ఏసీలు తీసి ఉంచడంతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం ఇచ్చాడు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన దొంగలను బయటకు రాకుండా తలుపులు వేసి లోపలే బంధించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్ అసోసియేషన్‌కు చేరుకుని అప్పటికే పట్టుకుని ఉన్న దొంగలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పశువుల కాపరి అనుమానాస్పద మృతి

జైపూర్: మండలంలోని ఇందారం శివారులో రామారావుపేట గ్రామానికి చెందిన పశువుల కాపరి దొర్ల కిష్టయ్య(50) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. నడిపల్లి ప్రవీణ్‌రావు లారీ యార్డు పక్కన ఉన్న ఓంప్రకాశ్ లవ్‌టీటీ భూమిలో ఆదివారం సాయంత్రం బర్లు మేపుకుంటూ వెళ్లి అనుమానాస్పద స్థితిలో పడివుండగా స్థానికులు గమనించి సమాచారం ఇచ్చారన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం వైగాం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి కౌటాల బుద్దె స్వామి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.9వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాగజ్‌నగర్ మండలంలో ఆరుగురిపై కేసు..

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం బోడపల్లి శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలిటిక్స్!



సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

- ఆర్కేపీ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ
- వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నుంచి పోటీచేసే చాన్స్
- బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని విమర్శలు

రామకృష్ణాపూర్: సింగరేణిలో రాజకీయం జోక్యం రోజురోజుకూ పెరుగుతోందా అంటే అవుననే అంటున్నాయి కార్మిక సంఘాలు. ఇప్పటికే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని యాజమాన్యం ఆదేశించింది. ఇదే అదునుగా సంస్థ విస్తరించి ఉన్న జిల్లాలు, నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్నారు. క్వార్టర్ల కేటాయింపు, బదిలీలను ప్రభావితం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా ఎల్లందుకు బదిలీ చేయడం వెనుక రాజకీయ జోక్యం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాపతినిధి ఒత్తిడితో ఉన్నతాధికారులు బదిలీ చేశారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

మూడేళ్లుగా విధి నిర్వహణ..



డాక్టర్ రాజరమేశ్

2019 జూన్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో రాజరామేశ్ విధుల్లో చేరారు. కోవిడ్ విజృంభించిన సమయంలో కొందరు వైద్యులు సెలవుపై వెళ్లినప్పటికీ రాజరమేష్ లీవు పెట్టకుండా అత్యుత్తమ వైద్య సేవలందించి సంస్థ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించటమే కాకుండా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

రాజకీయాల్లోకి వస్తాడన్న అనుమానంతోనే..

డాక్టర్ రాజరమేశ్ త్వరలో రాజకీయ అరంగేట్రం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలోకి వెళ్తారనేది ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీతో రాజరమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రాజరమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో కూడా ఆ మాజీ ఎంపీ పాల్గొనటం చర్చానీయాంశమైంది. ఎస్సీ వర్గానికి చెందిన రాజరమేశ్ రాజకీయాల్లోకి వచ్చి.. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఏదైనా పార్టీ నుండి బరిలోకి దిగితే కచ్చితంగా తమకు బలమైన ప్రత్యర్థి అవుతారన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని విపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీ నిలిపివేయని పక్షంలో లాంగ్‌లీవ్ పెట్టి మరింతగా ప్రజలకు చేరువై ఎన్నికల సమయానికి అధికార పార్టీకి దీటుగా నిలిచే ఏదైనా ఓ పార్టీలో చేరి చెన్నూర్ అసెంబ్లీ బరిలో పోటీ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. ఏదేమైనా రాజరమేశ్ పొలిటికల్ ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

బదిలీ నిలిపివేయాలని ఆందోళన



బంద్‌తో మూసిఉన్న దుకాణాలు

రామకృష్ణాపూర్: సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై విపక్ష నాయకులు ఆదివారం స్థానిక కోల్‌బెల్ట్ రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాజరమేశ్ కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలకు తెగించి సెలవులు పెట్టకుండా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. తన సోదరి పేరిట జీఎస్ఆర్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని ఆరోపించారు. వెంటనే బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బదిలీని నిరసిస్తూ సోమవారం పట్టణ బంద్ నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. దుకాణాలు మూసివేసి డాక్టర్ బదిలీ నిలిపివేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నాల సాగర్, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, పాలరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు...

ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో డాక్టర్ రాజరమేశ్ తన సోదరి పేరిట జీఎస్ఆర్(గొడిసెల సురేఖరాజ్) ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దానిద్వారా ఆపదలో ఉన్న వారికి, అనాథలకు చేయూతనందిస్తున్నారు. పలువురికి ఆర్థిక సహాయం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి బదిలీ చేయటంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ విధుల్లో చేరి మూడేళ్ల అవుతున్నా అకస్మాత్తుగా బదిలీ చేయటంపై సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు, విపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా నాయకులు పోచం, శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 29న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ సోమవారం గోలేటిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేసి, యూనియన్ కార్మికుల హక్కులు, వేతనాల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. పోరాటాల ఫలితంగానే కనీస వేతనం, పీఎఫ్, ఆసుపత్రి, పనిభద్రత, బోనస్‌లాంటి అనేక హక్కులు సాధించుకున్నామని పేర్కొన్నారు. అదే తరహాలో ఒకటో కేటగిరీ వేతనం, పర్మినెంట్, గ్రాట్యూటీ వంటి సమస్యలను 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో ప్రధాన ఎజెండాగా పెట్టి చర్చించాలని ఉద్యమాలు చేపట్టామన్నా రు. కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూ పొందించటంతో పాటు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో త రగతి విద్యార్థులు వర్షిత్, సంజీవ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికై నట్లు జిల్లా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ తెలిపారు. ఎంపికై న క్రీడాకారులను సోమవారం అభినందించి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో ఈ నెల 21, 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

- పలువురిపై కేసు నమోదు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండల కేంద్రంతో పాటు గొర్రెగుట్ట గ్రామంలో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండల కేంద్రంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.2,000 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మొర్లె తిరుపతి, బుర్రి రాములు, చింతపూడి పున్నం, పుల్గం సంతోష్, గురిజాల వెంకన్న, వనపర్తి రాజు, జర్పుల కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే మండలంలోని గొర్రెగుట్ట సమీపంలో రెండు పందెం కోళ్లు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీరాముల ఎల్లయ్య, బకాం రాము, బొక్క వెంకటేశ్వర్‌రావు, బొక్క కోటేశ్వర్ రావు, దార లస్మయ్య, పస్తం బాలరాజుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామ శివారులో శనివారం సాయంత్రం కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని పట్టుకుని, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పారిగాం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల వద్దరూ.13,030 నగదుతోపాటు నాలుగు పందెం కోళ్లు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈనెల 21న ప్రారంభం కానున్న నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం మెస్రం వంశీయులు వడమరకు పవిత్ర గంగాజలాలతో చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావ్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, హెచ్‌వో సుధీర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వద్దకు వెళ్లి..

తనకు మూడు చక్రాల స్కూటీ మంజూరుతోపాటు స్థానికంగా నివాసం ఉండేందుకు ఐటీడీఏ క్వార్టర్ ఇప్పించాలని దివ్యాంగురాలు గద్దం భీంబాయి అర్జీ పెట్టుకునేందుకు ఐటీడీఏకు చేరుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె వద్దకు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి నేరుగా వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



దివ్యాంగురాలి వద్దకు చేరుకుని అర్జీ స్వీకరిస్తున్న పీవో

సంక్రాంతి వేళ.. సైకిల్ రేస్

- చిన్నారుల్లో ఉత్సాహం నింపిన పోటీలు



గుడిపేటలో సైకిల్ రేస్ విజేతలతో ఎస్సై, ఎంపీపీ, వైస్ ఎంపీపీ



గుడిపేటలో సైకిల్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో సంక్రాంతి వేళ నిర్వహించిన సైకిల్ రేస్ చిన్నారుల్లో ఉత్సాహం నింపడమే కాదు ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పురస్కరించుకుని యువరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అండర్-15, అండర్-13, అండర్-10 విభాగాల్లో సైకిల్ రేస్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 70 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను హాజీపూర్ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఐదు రౌండ్లలో పోటీలు జరగగా ఫైనల్ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. విజేతలకు ఎంపీపీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు. అండర్-15 విభాగంలో మొదటి విజేతగా నిలిచిన గెల్లు సిద్ధుకు రూ.3 వేల నగదు, రన్నర్ మల్యాల అభినయ్‌కు రూ.2 వేల నగదు, తృతీయస్థానంలోనిలిచిన మడిపెల్లి సిద్ధుకు రూ.వెయ్యి అందించారు. అండర్-13 విభాగంలో మొదటి బహుమతి జేబీ.హర్మన్‌కు రూ.1,500, రన్నర్ కియాన్స్‌కు రూ.వెయ్యి, తృతీయ స్థానంలో నిలిచిన విజేత విష్ణుకు రూ.500 నగదు, అండర్-10 విభాగంలో ఫస్ట్‌ప్రైజ్ అత్తె మోక్షజ్ఞకు రూ.500 నగదు అందజేశారు. ఈ బహుమతులను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత-శ్రీనివాస్ దంపతులు, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి-రవి దంపతులు, గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి-రాజయ్య దంపతులు సమకూర్చారు. మండలంలోని రేల్‌టెల్ ఇంటర్‌నెట్ నిర్వాహకులు సైకిల్ పోటీల్లో పాల్గొన్న 70 మందికి కూడా పతకాలను అందజేశారు. ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు లగిశెట్టి రాజయ్య, బేర పోశం, దొమ్మటి బాపు, పీఈటీలు నరేందర్, మేకల లక్ష్మణ్, యువరాజ్యం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

లక్సెట్టిపేట: కడెం చివరి ఆయకట్టు వరకు ఉన్న దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరి పొలాలకు యాసంగి పంటకు నీరందించాలని మండలాల్లోని రైతులు ఆదివారం సంక్రాంతి పండగ రోజున స్థానిక అంబేద్కర్ చౌరాస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలాలకు రెండు పంటలకు నీరందించేలా చూడాలని, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. జలసాధనసమితి నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సీపీఎస్ ఉద్యోగుల మహాగర్జన

- రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం ఆగదని, ఇందులో భాగంగా ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహాగర్జన నిర్వహిస్తామని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు. జన్నారంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల పెన్షన్, గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, కమ్యుటేషన్ ఇతరత్రా హక్కులను కోల్పోవడానికి కారణం అయిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రాజస్థాన్ , పంజాబ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నాయని తెలిపారు. నాలుగు రోజుల క్రితం హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో కూడా సీపీఎస్ రద్దు చేశారని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం సరికాదన్నారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను, పీఆర్సీ, ఎరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 317 జీవో ప్రకారం స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి వారి స్థానిక జిల్లాలకు కేటాయించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఫిబ్రవరిలో నిర్వహించే మహాగర్జనకు రాష్ట్రం నలుమూలల నుంచి సీపీఎస్ బాధితులు తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గోళ్ల గంగన్న, గుమ్మడి అంకూస్, రమేశ్, కాంతయ్య, షఫీక్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

ముంగిట్లో నిరసన ముగ్గు

తాండూర్: సంక్రాంతి పండుగ వేళ మండలంలోని రేచిని పంచాయతీ పరిధిలోని బారేపల్లిలో ముంగిళ్లలో స్థానికులు నిరసన ముగ్గులు వేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇచ్చిన హామీలను ముగ్గులతో రాశారు. తమ గ్రామానికి రో డ్డు వేయించాలని, తాగునీటి సమస్య పరిష్కరించా లని గతంలో ఆందోళన చేయగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏడు నెలలైన పరిష్కరించకపోగా, అడిగినవారిపై అక్రమంగా కేసులు పెట్టించాడని, భౌతికదాడులు చేయించాడని వివరించారు. రోడ్డు వేయించి ఓట్లువేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవాలని సూచించారు.



సమస్యలు పరిష్కరించాలని వేసిన ముగ్గు

అ'పూర్వ' సమ్మేళనం

జైపూర్: మండలంలోని ఇందారంలో శ్రీనివాస హైస్కూల్ 2001-2002పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరీత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ సంక్రాంతి పండుగపూట ఒక చోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పంచుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోధ్యాయులుగా పని చేసిన గందం రాజన్న దంపతులను, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి బహుమతులతో సత్కరించారు.

